క్లుప్తంగా

ఇదేం సెల్ఫ్ అసెస్మెంట్?



కూడేరు హైస్కూల్‌లో గుంపులుగా కూర్చొని పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కూడేరు: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను అంచనా వేసేందుకు ప్రభుత్వం సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పరీక్ష–1ను ఈనెల 11 నుంచి నిర్వహిస్తోంది. 11, 12 తేదీల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పరీక్షలు ముగిశాయి. హైస్కూల్లో 14వ తేదీ వరకు కొనసాగుతాయి. అయితే బుధవారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో జరిగిన పరీక్షను విద్యార్థులు ఒకరి దాంట్లో మరొకరు చూసుకుంటూ గుంపులుగా కూర్చొని రాశారు. పరీక్ష ఇలా చూసి రాయడం ద్వారా విద్యా సామర్థ్యాలు పెంపొందవు. పదో తరగతి విద్యార్థులు చూచిరాతకు అలవాటు పడితే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాగలరా? అత్యధిక మార్కులు సాధించగలరా? అని స్థానికులు మండిపడుతున్నారు. 11వ తేదీ నుంచి విద్యార్థులు ఇదే విధంగా పరీక్ష రాస్తున్నా.. హెచ్ఎం, విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు పర్యవేక్షించి పిల్లల్లో విద్యా సామర్థ్యాలు పెంపొందించేలా చర్యలు చేపట్టాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో పాల్గొన్న ఏపీపీటీడీ ఎన్ఎంయూ నాయకులు, ఉద్యోగులు

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ ఉద్యోగుల ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల ధర్నా కార్యక్రమంలో భాగంగా బుధవారం కూడా ఆర్టీసీ డిపో గ్యారేజీ గేటు ముందు ఉద్యోగులు ధర్నా చేపట్టారు. నాయకులు ఎర్రిస్వామి, డిపో కార్యదర్శి హెచ్.తిప్పేస్వామి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు ఇవ్వాలని, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని, ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు పరం చేయొద్దన్నారు.

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మెట్టు దంపతులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని నేషనల్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన మోపురు రాజేష్, కావ్య వివాహానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి, ఆయన సతీమణి యశోదమ్మ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు.

నేమకల్లు సేవా అర్చకుడి మృతి



మురళీధర్ (ఫైల్)

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులోని ఆంజినేయస్వామి ఆలయంలో సేవా అర్చకుడు మురళీధర్ (53) అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందారు. మృతుడికి భార్య మంజుల, కుమారుడు ప్రజ్వల్, పవన్ ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం, దేవాదాయశాఖ ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



రోగులకు సూచనలిస్తున్న వైద్యులు

కూడేరు: కుష్టు వ్యాధిగ్రస్తులు కాళ్లు, చేతులకు పుండ్లు కాకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని డీపీఎంఓ మరియాదాస్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని కుష్టు రోగుల కాలనీలో వైద్య శిబిరం నిర్వహించారు. డీపీఎంఓ మరియాదాస్ మాట్లాడుతూ.. రోజూ టబ్‌లో నీరు పోసి అందులో కాళ్లు, చేతులను శుభ్రం చేసుకుంటే పుండ్లు కాకుండా అరికట్టవచ్చన్నారు. లేదంటే పుండ్లు ఏర్పడి ఇబ్బంది పడాల్సి వస్తుందని హెచ్చరించారు. కాళ్లు, చేతులను ఏవిధంగా శుభ్రం చేసుకోవాలో డెమో చేసి చూపించారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు బ్యాండేజీ క్లాత్, మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్ఎం వసుంధర, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కొందరికే అన్నదాత సుఖీభవ!

- నేటికీ బ్యాంక్ ఖాతాలకు జమ కాని నగదు
- బ్యాంకులు, రైతు సేవా కేంద్రాల చుట్టూ రైతన్నల ప్రదక్షిణలు
- పట్టించుకోని పాలకులు



కళ్యాణదుర్గం: అన్నదాతలను ఆదుకునేందుకు... పంటల పెట్టుబడి సాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నగదు కొందరు రైతులకే అందింది. ఇటీవల నగదును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా రైతుల ఖాతాలకే జమ చేస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించి ప్రారంభించినా నేటికీ సగానికి పైగా రైతన్నలకు డబ్బు జమ కాక పోవడం గమనార్హం. దీంతో నేటికీ రైతన్నలు బ్యాంకులు, ఆయా గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

సగానికి పైగా జమ కాని వైనం

కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల్లో నేటికీ పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాలకు జమ కాలేదు. పీఎం కిసాన్ అప్‌డేట్ లేదని కొందరికి, బ్యాంక్ లావాదేవీలు జరపలేదని మరికొందరికి నగదు జమ కాకపోవడంతో రైతన్నలు నేటికీ ఆయా బ్యాంకులు, రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు మాత్రం అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాలకు కోట్లాది రూపాయలు జమ చేసినట్లు నివేదికలు చూపుతున్నారు.

జమ చేసిన వారికీ బ్యాంకుల కొర్రీలు

పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల కింద రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జమ చేసిన రూ.7 వేల నగదుపై పలు బ్యాంకులు కొర్రీలు పెడుతున్నాయి. ఆయా బ్యాంకుల్లో రైతులు తీసుకున్న వ్యక్తిగత రుణాలకు జమ చేసుకుంటున్నారు. ప్రతి నెలా వ్యక్తిగత రుణాలను సక్రమంగా కంతులు చెల్లించిన వారివి కూడా జమ చేసుకుంటున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీ, పథకాల నగదులో కోత విధించకుండా అందించాలని నిబంధనలు ఉన్నా బ్యాంకర్లు వాటిని బేఖాతరు చేస్తున్నారు. దీనిపై పాలకులు స్పందించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల్లో పీఎం, కిసాన్, అన్నదాత సుఖీభవ వివరాలు

నియోజకవర్గం	మొత్తం రైతులు	పీఎం కిసాన్ నిధులు రూ.కోట్లలో	అన్నదాత సుఖీభవ నిధులు రూ.కోట్లలో
కళ్యాణదుర్గం	50,595	రూ.10.12	రూ.25.30
రాయదుర్గం	42,533	రూ.8.51	రూ.21.27
ఉరవకొండ	47,680	రూ.9.54	రూ.23.84

లిస్టులో పేరుంది... కానీ జమ కాలేదు



పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల కింద రూ.7 వేలు వస్తుందని రైతు సేవా కేంద్రంలో లిస్టులో పేరు ఉంది. కానీ ఇప్పటికీ నా బ్యాంకు ఖాతాకు డబ్బు జమ కాలేదు. బ్యాంకులో చెక్ చేస్తే ఇంకా పడలేదు అంటున్నారు. ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియడం లేదు.

– ఆనం రామిరెడ్డి, రైతు, బోరంపల్లి

వ్యక్తిగత రుణాలకు పట్టుకోకూడదు



రైతులకు పెట్టుబడి సాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా రైతుల ఖాతాలకు జమ చేసిన నగదును వ్యక్తిగత రుణాలకు పట్టుకోకూడదు. పంటలు పెట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వాలు అందించే సాయాన్ని కూడా బ్యాంకర్లు కట్ చేస్తే రైతులు ఎలా పంటలు సాగు చేస్తారు. సక్రమంగా కంతులు చెల్లిస్తున్నా కూడా కొందరు రైతుల ఖాతాల నుంచి రైతులకు తెలియకుండానే నగదు జమ చేసుకోవడం విడ్డూరం.

– అఖిలాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం తాలూకా అధ్యక్షుడు

వైఎస్ జగన్ పర్యటన విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ నరసింహులు

ఉరవకొండ: జిల్లా కేంద్రంలోని రాంనగర్ 80 ఫీట్ రోడ్‌లో అయ్యప్ప స్వామి గుడి వద్ద జీఎంఆర్ గ్రౌండ్స్ వద్ద గురువారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి తనయుడు వై.ప్రణయ్‌రెడ్డి వివాహం రోహితారెడ్డితో జరగనుంది. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివాహానికి హాజరుకానున్నారని ఎంపీపీ నరసింహులు తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. అధినేత పర్యటనకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, పార్టీ రాష్ట్ర నాయకులు బసవరాజు, లత్తవరం గోవిందు, పార్టీ మండల సమన్వయకర్త ఓబన్న, ఎంపీటీసీ ప్రకాశ్, వేమన్న పాల్గొన్నారు.

పంటల బీమా అందలేదని రైతుల గగ్గోలు

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడులో ముచ్చర్లపల్లి అంజినయ్య, ఈడిగ లక్ష్మీదేవి భర్త వెంకటేశులు తమ అకౌంట్లలోకి పంటల బీమా పరిహారం అందలేదని వాపోతున్నారు. అంజినయ్యకు 1.23 ఎకరా ఇరవై మూడు సెంట్లు , లక్ష్మీదేవికి 4 ఎకరాల మాత్రమే భూమి ఉంది. ఏటా క్రమం తప్పకుండా తమ ఖాతాల్లో నగదు జమ అయ్యేదని వారు పేర్కొన్నారు. ఇప్పుడు ఎందుకు జమ కాలేదో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పలుమార్లు సంప్రదించినా సరైన సమాధానం చెప్పలేకపోతున్నారన్నారు. ఇప్పటికై నా సంబంధిత శాఖల అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. మండల వ్యవసాయాధికారి నిర్మల్‌కుమార్‌ను వివరణ కోరగా రెండో విడతలో నగదు మంజూరవుతుందని పేర్కొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ



దాడిలో గాయపడిన యోగేంద్రనాథ్

కణేకల్లు: మండలంలోని 43 ఉడేగోళం గ్రామంలో భూతగాదా విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. బాధితులు యోగేంద్రనాథ్, నాగరాజు కథనం మేరకు... తమ పూర్వీకుల భూమిని కొందరు సాగుచేస్తున్నట్లు తెలియడంతో బుధవారం పొలంలో వెళ్లి అడ్డుకొనే ప్రయత్నం చేశామన్నారు. అయితే వారు తమపై ఇనుపరాడ్లు, కత్తులు, వేటకొడవళ్లతో దాడులు చేసి గాయపరిచారన్నారు. గాయపడిన వారు అనంతపురం ఆస్పత్రిలో చికిత్స చేయించుకొన్నారు. జరిగిన ఘటనపై ఎస్పీకు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు.

బీటీపీకి తగ్గిన వరద

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ గ్రామ సమీపంలో వేదావతి హగరిపై నిర్మించిన బీటీ ప్రాజెక్టుకు వరదనీరు తగ్గుముఖం పట్టాయి. మంగళవారం 1,964 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో కాగా బుధవారం నాటికి 600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోకు పడిపోయినట్లు జలవనరులశాఖ ఏఈ హరీష్ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు 1,650.9 అడుగులకు చేరుకుందన్నారు.

ఆముదం, కంది సాగు చేసుకోండి

కూడేరు: పదునైన వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆముదం, కంది పంటలు సాగు చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి శుభకర్ సూచించారు. బుధవారం కూడేరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆముదం, కంది విత్తనాలను నాణ్యత చూసి కొనుగోలు చేయాలన్నారు. నాణ్యత లేని విత్తనాలు విత్తితే ఆశించిన స్థాయిలో దిగుబడులు రావన్నారు. దీంతో నష్టపోవాల్సి వస్తుందని తెలియజేశారు. ఈ నెలాఖరు వరకు ఆముదం, కంది సాగు చేసుకోవచ్చన్నారు. పంటల సాగులో మెలకువలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. పంటల సాగులో సందేహాలుంటే రైతు సేవా కేంద్రాల్లో ఉన్న అధికారులను కలిసి వివృత్తి చేసుకోవాలన్నారు.

బాలికోన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను డీఈఓ ప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికతోపాటు పలు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో విద్యాబోధనపై ఆరా తీశారు. పాఠశాల అవరణలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆగస్టు 15న జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే పరేడ్ నేపథ్యంలో విద్యార్థులకు ఇస్తున్న తర్ఫీదును పరిశీలించారు.

ఆర్డీటీకి లైసెన్స్ రెన్యూవల్ చేయాలి



ర్యాలీ చేస్తున్న ఆర్డీటీ అభిమానులు



బ్రహ్మసముద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి వెంటనే ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని ఆర్డీటీ అభిమాన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏ మంజూరు చేయాలని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. నిరుపేదల విద్య, వైద్యం, ఇళ్లు నిర్మిస్తున్న ఆర్డీటీకి చేయూతనిచ్చి ఆదుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో బీటీపీ హనుమంతు, కోనాపురం మల్లికార్జున, హనుమంతు, మారెన్న, లింగరాజు, దేవరాజు, రవి, అనిల్, మంజునాథ, గోవిందు, శాంతి, వీరాపురం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలి

బ్రహ్మసముద్రం: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను రెన్యూవల్ చేయాలని ఆర్డీటీ పరిరక్షణ కమిటీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి తహసీల్దార్ సుమతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను రెన్యూవల్ చేయకపోవడంతో పేదలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆర్డీటీ సేవలు కొనసాగేలా చూడాలని కోరారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: ఉద్యాన రైతులు ప్రభుత్వ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి కృష్ణతేజ, గౌసియా తెలియజేశారు. బుధవారం పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో ఆర్ఎస్‌కే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారులు మాట్లాడుతూ కొత్త తోటల విస్తరణ , ఫారంపాండ్లు, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్మెంట్ కింద ప్యాక్ హౌస్, కోల్డ్ రూమ్, కోల్డ్ స్టోరేజీ, సోలార్ డ్రయర్స్, రైఫెనింగ్ ఛాంబర్స్ తదితర అన్ని పథకాలకు ప్రభుత్వం 40 నుంచి 50 శాతం రాయితీ కల్పిస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు రాయితీలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆర్ఎస్‌కే సిబ్బందిదేనన్నారు. ప్రతి రైతు ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజవర్గంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.



బస్టాండ్‌లో అడ్డంగా నిలిచిన పశువులు

మేమింతే.. కదలమంతే

- రహదారిపై మూగజీవాల తిష్ట

కూడేరు: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో అనంతపురం–బళ్లారి రహదారిపై పెద్ద సంఖ్యలో మూగ జీవాలు తిష్ట వేస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించి పోతోంది. వాహనాదారులు హారన్ కొట్టినా మేమింతే పక్కకు కదలమంతే అన్నట్టుగా అవి పక్కకు కదలడం లేదు.వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి పూట రహదారిపైనే పడుకుని ఉంటాయి. ద్విచక్ర వాహనదారులు చీకట్లో వాటిని ఢీకొని రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై మూగజీవాలు లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.

రోడ్డు ఇలా.. నడిచేదెలా?



మరుట్ల–3వ కాలనీలో బురదమయమైన రోడ్డు

కూడేరు: మండల పరిధిలోని మరుట్ల–3వ కాలనీలో రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షం కురిస్తే అందులో నీరు చేరి రోడ్లు బురదమయమవుతున్నాయి. బురద నీటిలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెందడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో కల్వర్టు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డు నుంచి ఈద్గా, శ్మశాన వాటిక, ఈద్గా, మసీదుకు వెళ్లే ప్రధాన రహదారి వద్ద కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. దారిలోని కాలువపై ఉన్న బండలు ధ్వంసమయ్యాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికే ఖబరస్థాన్ కమిటీ, ముస్లిం జమాత్ సభ్యులు కల్వర్టు నిర్మించి రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఈద్గాకు వెళ్లే రోడ్డు కాలువపై ధ్వంసమైన బండలు

వెన్న అలంకరణలో అంజన్న



వెన్న అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: నేమకల్లు ఆంజినేయస్వామి ఆలయంలో శ్రావణ మాసం బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. వెన్న అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు అనీల్‌కుమార్‌చార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పవిత్ర గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, తదితర పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

జననీ సురక్షే లక్ష్యం

బొమ్మనహాళ్: జననీ సురక్షే ప్రభుత్వ లక్ష్యమని బొమ్మనహాళ్ పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి శ్రావణ్ కుమార్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో గర్భిణులకు పరీక్షించారు. వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. తల్లీబిడ్డ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం అవశ్యతను వివరించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని అన్నారు.

శుభకార్యం



వివాహ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండలంలోని మార్రిమాకులపల్లిలో బుధవారం వైఎస్సార్‌సీపీ నేత శంకర్ప కుమార్తె వివాహం జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, పార్టీ నేత ఉమా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ములనూరు తిమ్మరాయుడు, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, సర్పంచ్ బాపూజీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు, నాయకులు బొమ్మలింగ, గోవిందప్ప, రామన్న, గోవిందప్ప, సత్తి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం బొమ్మనహాళ్ యువజన సంఘం నాయకులు నవీన్, ఉపాధ్యాయులు రవి చక్రవర్తి దాతల సహకారంతో క్రీడా దుస్తులు, మైకు సెట్ పంపిణీ చేసినట్లు ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనిల్‌కుమార్, పీడీ బోగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేవీవీ రాయదుర్గం కమిటీ ఎన్నిక



జేవీవీ అధ్యక్షుడిగా ఎన్నికైన మద్దిలేటి శివానంద

రాయదుర్గంటౌన్: రాయదుర్గంశాఖ జన విజ్ఞాన వేదిక నూతన కమిటీని బుధవారం స్థానిక ఏపీఎన్జీవో భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేవీవీ రాయదుర్గంశాఖ అధ్యక్షుడిగా మద్దిలేటి శివానంద, ప్రధాన కార్యదర్శిగా కె.నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ఏం.తిప్పేస్వామి, కోశాధికారిగా భీమేష్‌లను ఎంపిక చేశారు.

ఎనిమిది కాళ్ల గొర్రె పిల్ల జననం



తాళ్లకెరలో ఎనిమిది కాళ్లతో జన్మించిన గొర్రె పిల్ల

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెరలో జానమద్ది శివరాజులుకు చెందిన గొర్రె ఎనిమిది కాళ్లు, ఒక తలతో ఉన్న పిల్లకు బుధవారం జన్మనిచ్చింది. పుట్టిన రెండు గంటల్లోనే గొర్రె పిల్ల చనిపోయిందని శివరాజులు తెలిపారు. జన్యుపరమైన లోపం కారణంగా ఇలాంటి అరుదుగా జన్మిస్తాయని పశువైద్యుడు నవీన్‌కుమార్ తెలిపారు.